లక్ష్మి లేచిపోయింది. ఆ వార్త పిడుగులా పడింది. వాడవాడంతా పొగమంచులా వ్యాపించిపోయింది. మగవాళ్లల్లో అధికం ఆశ్చర్యంలో మునిగిపోయారు. ఆడవాళ్ళల్లో అధికం ఆనందంతో తేలిపోయారు. కుర్రకారులో అధికం లాటరీ పోయినట్టు బిక్కమొహాలు వేశారు. అనతి కాలంలోనె గుసగుసలూ, విమర్శలతో వాతావరణమంతా నిండిపోయింది.

"అవ్వా! ఎంత పని చేసింది పాడు ముండ! ఎంత నంగనాచి! వొంటినిండా కొంగు కప్పుకుని, వంచిన తల ఎత్తకుండా వెళ్తోంటే అబ్బో! ఎంత మంచి పిల్లో అనుకునేదాన్ని. ఆఖరికి ఎంతకు తెగించింది!...."

"ఆ(, ఆ దాన్ననేం లాభంలే. తల్లి ననాలి, ఆ తండ్రిననాలి. ఎద్దులా ఏపున పెరుగుతున్న కూతుర్ని పెళ్ళిపెడాకులు లేకుండా ఇంట్లో పడేసి పెడ్తే ఇంకేం చేస్తుంది? అదీ ఉప్పూకారం తింటున్న మనిషేగా తోటిపిల్లలు తల్లులై పోతున్నారు దానికి ఇరవై రెండు దాటుంటాయి"

"ఇరవై రెండే(విటి, ఇరవై అయిదు కూడా దాటి వుంటాయి. ఆ మొహం చూస్తే తెలీదూ?"

"తగిన శాస్తే జరిగిందిలే తాయారమ్మకు లేపోతే అంత పొగరే(విటి? ఓహారింటికి రాదూ. పోదూ. ఇంటికెళ్ళినా ముక్తసరిగా మూడు మాటలు మాట్లాడి ముగిస్తుంది."

"నీకెలా తెలిసిందొదినా?"

"మా పనిమనిషి చెప్పింది."

"దానికెవరు చెప్పారో?"

"ఒహరు చెప్పేదే(విటి. అది ఆ ఇంట్లోనూ పని చేస్తుందిగా."

"ఇంతకూ ఆ ప్రబుద్ధుడెవరో?"

"ప్రబుద్ధుడంటే?"

"అదే. దాన్ని లేవనెత్తుకుపోయాదే వాడు."

"అదే తెలీటంలేదు."

"ఇంకెవరూ, ఆ కామాక్షమ్మ కొడుకే అయ్యుంటాడు"

"ఏ కామాక్షమ్మా?"

"కామాక్షమ్మ తెలీదూ? తాయారమ్మ ఇంటి ఎదురుగా వుంటుందె ఆవిడ."

"ఆవిడ కొడుకు ఇక్కడెక్కడున్నాడూ! విదేశాలకు వెళ్ళిపోయాడుగా!"

"అదెప్పుడూ?"

"ఓ ఆర్నెల్లవుతుంది."

"నిజంగానె? నాకు తెలీనే తెలీదుసుమా! మరింకెవడై వుంటాడబ్బా?"

"నాకు తెలుసు కాని, నేను చెప్పను."

"అదేటమ్మోయ్! ఎందుకు చెప్పవూ?"

కన్నెపిల్లపై కాంతలు ప్రదర్శించే జాలి ఎలా వుంటుంది?



# జాలిగుండె

## నెల్లూరికేశవస్వామి

"మా ఆయన చెపొద్దన్నాడు"

"అయితే మీ ఆయనకు తెలుసన్నమాట. చెప్పవే(...."

"ఎందుకు చెపొద్దన్నారే(విటి?"

అందరికీ తెలిసిపోతుందీ. బావుండదన్నారు."

"బావుంది వరస. మేమెందుకు చెబుతామూ?"

"అసలు అందరికీ చెప్పే విషయమేనా ఇది? మేమెవ్వరితోనూ చెప్పంగానీ. చెప్పు."

"చెప్పమంటారా....?"

"ఊ(, ఊ(, చెప్పు త్వరగా. సస్పెన్స్‌తో చచ్చిపోతున్నాం."

"..వాళ్ళింట్లో పనిచేసే ఆఫీసు కుర్రాడు లేడూ. వాడు"

"నిజంగానే?"

"అవును. వాడూ ఆ పిల్లా కలిసి తిరుగుతుంటే ఎన్నోసార్లు చూశారట మా ఆయన."

"అయితే వాడే అయ్యుంటాడు."

"ఛ. ఛ! అంతా వొట్టిది. ఇవ్వాళ్ళ ప్రొద్దున వాడు ఇంట్లోనే వున్నాట్ట. మా పనిమనిషి చెప్పింది."

"అరె. అలాగా?....అయితే. వాడూ కాదన్నమాట."

"వాళ్ళ కాలేజీలో ఓ ముస్లింల కుర్రా

డుండేవాడట అప్పుడప్పుడు వాళ్ళింటికికూడా వస్తూంటాడట. వాడు కాడుకదా?...."

"ఆ. ఆ(. వాడే అయి వుంటాడు. ఇద్దరూ ప్రేమించుకున్నారేమో. పెళ్ళికి తాయారమ్మవాళ్ళు ఒప్పుకోలేదేమో. అందుకే వుడాయించేశారేమో...."

"ఛీ ఛీ! ఆఖరికి ముస్లింల కుర్రాడితోనా....?"

"అనవసరంగా ఎందుకర్రా అపనిందలు వెయ్యటం?"

"మం నిజం తేలటంలేదే ?"

"ఎందుకూ కామాక్షమ్మగారి ఇంటికెళ్ళి కనుక్కుంటే పోలా ?"

"అవునవును. బావుంది అయిడియా. పోదాం పదండి "

అందరూ కట్టకట్టుకుని వాలారు కామాక్షమ్మ ఇంటి ముందు. తలుపుతీసి నిర్ఘాంతపోలేదు. కామాక్షమ్మ మందహాసంతో ఆహ్వానించింది

"రండి రండి ఇందాక మీగురించే తలుచుకుంటున్నాను. మిమ్మల్నంతా సాయంత్రం పిలుద్దామని అనుకుంటూంటే ఇప్పుడే వొచ్చేశారు "

అర్థంకాక ఒకరిమొహాలొకరు చూసుకున్నారు

"మమ్మల్ని పిలుద్దామనుకున్నారా?.. ఎందుకూ?"

"మీరెందుకొచ్చారో అందుకే .... లక్ష్మి గురించేగా మీరంతా వొచ్చింది?"

"అరె, పసిగట్టేశారే?"

"త్వరగా చెప్పేసెయ్యండి కామాక్షమ్మగారూ! అసలు ఏం జరిగిందో తెలీక అప్పట్నించీ సతమతమై పోతున్నాం."

"చెబుతా అంత తొందరైతే ఎలా?.... ఎలాగూ ఇంతదూరం ఒచ్చారు. కూచోండి కాసేపు ఆనక మళ్ళీ ఒద్దురుగానిలెండి."

"మళ్ళీ ఎందుకూ?"

"చెబుతా చెబుతా. అంతా చెబుతా కాస్త ఓపిక పట్టి కూచోండి."

అందరూ కూచున్నారు.

"ఊ( చెప్పండి "

తానూ కూచుని నిదానంగా మొదలెట్టింది కామాక్షమ్మ.

"పాపం! లక్ష్మి ఎంత మంచి పిల్లో! ఎంతఅందంగా వుంటుంది మీరంతా చూసే వుంటారుగా. ఎంతో నిదానం. ఓర్పు. మితభాషి - ఎక్కువ మాట్లాడదు ఎవరితోనూ నాతోతప్ప. వాళ్ళు ఈ ఇంట్లో కొచ్చినప్పట్నించీ నాతో ఎంతో చనువుగా వుండేది. "అత్తయ్యా!" "అత్తయ్యా?" అంటూ నా వెనకాలే తిరిగేది. నాకూ ఆ అమ్మా


తెలుగు పాఠక లోకానికి
స్పందన సాహితీ సమాఖ్య కానుక
స్పందన వాణి
సాహిత్య మాస పత్రిక
తమదైన ప్రత్యేకతను నిలుపుకునే విలువైన
కథలు, కవితలు, వ్యాసాలు, గ్రంథ సమీక్షలతో
బాటు ఇంకెన్నో శీర్షికలు — 1/8 డెమ్మీ సైజు
ప్రతి నెలా మొదటి తేదీ విడుదల - వెల రు 1-50
సంవత్సర చందా :- రు. 15-00.
ఏజన్సీ వివరాలకు :- స్పందన సాహితీ సమాఖ్య (REGD)
26-162, బుట్టాయిపేట,
మచిలీపట్టణం-521001.



యంటే ఎంతో ప్రాణం. నాకు ఆడపిల్లలు లేరుగా లక్ష్మి నాకు కూతురో. కోడలో అయితే ఎంత బావుణ్ణు అనుకునేవాన్ని. అందుకే ఆ పిల్లనుచూస్తోంటే నాకు అమిత మైన జాలి."

"జాలెందుకూ?"

"అంత మంచిపిల్లకు పెళ్ళి కాలేక పోతోందే అని నాకు బెంగగా వుండేది."

"పెళ్ళెందుకు కాలేదో మరి?"

"ఎందుకేవిటి కట్నాల పిశాచముందిగా ప్రతి తల మాసిన వెధవకూ పాతికా ముప్ఫైవేలు కావాలాయె. పాపం ఆ తలి దండ్రులు ఎక్కడ్నుంచి తెచ్చి పోస్తారు? మీకంతా తెలుసుగా వాళ్ళేమంత డబ్బున్న వాళ్ళనీ?"

"పోనీ. అంత జాలిపడిపోతున్నారే కామాక్షమ్మగారూ! కట్నం లేకుండా మీ అబ్బాయికి చేసుకోలేకపోయారా?"

"అయ్యో తల్లీ! అలా జరిగితే ఎంత బావుణ్ణు ఎంతగానో చెప్పాను మావాడికి. ససేమిరా వొద్దన్నాడు. అసలు పెళ్ళిమాటే ఎత్తనిచ్చేవాడుకాదు. ఆఖరికి అమెరికావెళ్ళి ఏంచేశాడో చూశారా? అక్కడో అమ్మాయిని ప్రేమించి. పెళ్ళి చేసేసుకున్నాట్ట. చల్లని కబురు అందజేశాడు."

"నిజంగానే?"

"పైగా, ఏదో కళ్ళు తుడుస్తూన్నట్టు. అమెరికా అమ్మాయి కాదు, భారతీయుల పిల్లే అని కూడా రాశాడు."

"మరి అంత మాత్రానికి అక్కడెందుకూ-ఇక్కడే లక్ష్మిని చేసుకుని వెళ్ళుండ కూడదూ?

"అదే నా బాధ....సరే. వాడు మగవాడు వాడికి తోచింది వాడు చేశాడు. మరి ఆడపిల్ల దీని గతేంకానూ? అప్పట్నుంచీ నాకదే దిగులు "

"మధ్య మీ కెందుకండీ దిగులూ? దానికి తోచింది అది చేసేసిందిగా...."

"అసలు విషయం చెప్పారేకాదు కామాక్షమ్మగారూ!"

"చెబుతాను. చెబుతాను "

"అబ్బ! ఇంకెంతసేపు నానుస్తారండీ పొద్దుబోతోంది. పిల్లలు ఇంటికి వచ్చే వేళయింది. ఒక్క ముక్కలో చెప్పే సెయ్యండి ఎవడోవాడు."

"అయ్యయ్యో వాడూ వీడూ అంటారేవిటండీ? ఆయన ఎంత మంచివారో మీకేం తెలుసు."

"ఆ మంచివాడే! పెళ్ళికాని పిల్లను లేవనెత్తుకు పోయినవాడు మంచివాట్ట మంచి వాడు!"

"రామరామ ఎంత మాటన్నారూ? లక్ష్మి లేచిపోయిందా? ఎవరండీ ఆ పుకారు పుట్టించిందీ? లక్ష్మి అలాంటి ఇలాంటి పిల్లనుకున్నారా యేంటి? వజ్రముండివజ్రం. దానికేం ఖర్మ లేచిపోవటానికి? అదీ నేనుండగా?...."

"మరి ఏమైపోయిందీ?"

"ఏమవుతుంది లక్షణంగా పెళ్ళి చేసుకుంటోంది."

"పెళ్ళా?" అందరూ నోళ్ళు తెరిచారు.

"పెళ్ళే....ఉండండి. మీరూ చూద్దురుగాని. ఈ పాటికి వచ్చేస్తూ వుంటారు.

"ఎక్కడ్నించీ?"

"రిజిస్ట్రారు ఆఫీసు నించి."

"ఇక్కడికి వస్తారా?"

"ఇక్కడికే, మరింకెక్కడికి వెళ్తారూ?"

"అంటే, పెళ్ళి కొడుకు మీ బంధువే నన్నమాట."

"బంధువేమిటండీ.... మావారే...."

"ఆఁ?" ఈ సారి అమ్మలక్కల ఆశ్చర్యానికి అంతులేదు.

"ఏవిటేవిటీ లక్ష్మిని మీవారు పెళ్ళి చేసుకుంటున్నారా? చెప్పారు కారేం....?"

"మీరు చెప్పనిస్తేగా. ఒహటే తొందర."

"ఎంత విడ్డూరం! ఎంత విడ్డూరం!"

"విడ్డూరమే. కాదనను కాని ఏంచేస్తాం? అటేమో లక్ష్మికి పెళ్ళీడుదాటి పోతోంది. ఆ తలి దండ్రులు దాని కీజన్మలో పెళ్ళి చేస్తారన్న నమ్మకం లేకుండా పోతోంది. ఇటేమో నాకు నలభై దాటాక కాళ్ళ నొప్పులూ, నడుం నెప్పితో కుంగిపోతున్నాను. మావారు చెక్కుచెదరకుండా వున్నారు. వారికి సేవలు చెయ్యలేక చచ్చిపోతున్నానంటే నమ్మండి. అటు లక్ష్మినీ ఇటు మా వారినీ చూస్తోంటే నా గుండె తరుక్కుపోతోంది."

"అందుకని వాళ్ళిద్దరికి మీరే పెళ్ళి చేస్తున్నారన్నమాట."

"ఇంతకూ తాయారమ్మ వాళ్ళు సమ్మతించారా?"

"తాయారమ్మ మాట అలా వుంచండి. ముందు లక్ష్మి. మా వారూ ఒక పట్టాన ఒప్పుకుంటేనా? వాళ్ళకి నచ్చచెప్పి వొప్పించేసరికి తలప్రాణం తోక్కొచ్చింది."

"అవును మరి. ఈడూ జోడూ కుదరని సంబంధమాయె."

"ఈడూ జోడు కేమైందండీ? లక్ష్మికి పాతిక నిండాయా? మావారికింకా నలభై ఐదు దాటలేదు. నాకు సహం తల నెరిసింది. దవడపళ్ళు వూడుతున్నాయి. వారికి ఒక్క పన్నూ వూడటంలేదు. ఒక్క వెంట్రుకా తెల్లబడలేదు. మీరూ చూస్తూనే వుంటారుగా."

"అది సరే మరి తాయారమ్మ వాళ్ళ మాట?"

"వాళ్ళో చాదస్తం మనుషులు. అటు పిల్ల పెళ్ళి చెయ్యాలేరు. ఇటు నే చేస్తోంటే వూర్కోనూ లేరు. నానా రభసా చేశారు. నామీద దుమ్మెత్తి పోస్తోంది. ఆ తాయారమ్మ."

"పిన్నిగారూ! మీ రొక్క విషయం మరిచిపోతున్నట్టున్నారు. మీరు చేసే ఈ పెళ్ళి చట్ట విరుద్ధం. తాయారమ్మవాళ్ళు తలచుకుంటే మీ వారిని అరెస్టు కూడా చేయించగలరు."

"చూడమ్మాయి. నీ పేరేవిటో గుర్తు రావటంలేదు. ఏం చదువుకున్నావమ్మా?"

"ఇప్పుడు నా చదువు సంగతెందుకండీ?"

"అహఁ అదికాదూ, లాయరీ ఏమేనా చదివావేమోననీ...."

"ఈ మాత్రం తెలియటానికి లాయరు కావాలాండీ?"

"మరి మా వారు లాయరు. అది నీకు తెలుసో లేదో? చట్టాల సంగతి వారికి బాగా తెలిసి వుండాలే...."

"తెలిసే పప్పులో కాలు వేస్తున్నారన్న మాట."

"మరీ అంత తీసెయ్యకు మా వారిని. నా చేతేదో కాగితం రాయించుకున్నారు. అది చాలుట అన్ని అవాంతరాల్నీ ఎదుర్కోటానికి."

"కొంపదీసి విడాకులు కాదుగదా?"

"విడాకులో విస్తరాకులో నాకు తెలీదు. ఏదైతే ఏముందిలెండి. ఇహ ఈ ఇంటినీ, వాళ్ళిద్దర్నీ వొదిలి నేనెక్కడి కెళ్తానూ? హాయిగా కాలుమీద కాలు వేసుకుని కృష్ణా రామా అనుకుంటూ కూచుంటాను. అంతా అదే. లక్ష్మి. మా యింటి గృహలక్ష్మి చూసుకుంటుంది."

"మీ గుండె నిబ్బరానికి నిజంగా దండం పెట్టాలి కామాక్షమ్మగారూ! .... ఇహనేం, అంతా తేలిపోయిందిగా, వస్తాం."

"అయ్యో వెళ్ళిపోతారా? అమ్మాయిని చూడరూ? ఈ పాటికి వచ్చేసి వుండాలే.. పోన్లెండి సాయంత్రం తప్పకుండా రండి. అమ్మాయిచేత పసుపూ కుంకం ఇప్పిస్తాను. దీవించి వెళ్ళండి వస్తారు కదూ?"

"ఓ. తప్పకుండా వస్తాం." అందరూ బిల బిలా బయటపడ్డారు. ఎప్పుడెప్పుడు ఈ వింత వార్త మొగుళ్ళ చెవుల్లో వెయ్యాలా అన్న ఉబలాటంకొద్దీ.

★